బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం



బీఆర్ఎస్ నాయకుడిని ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

కులకచర్ల, నవంబర్ 16: బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శనివారం చౌడాపూర్ మండల పరిధిలోని బంగరంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త కేశవులు మాతృమూర్తి మృతి చెందింది. ఆమె కుటుంబాన్ని పరామర్శించి ధైర్యాన్ని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. అనంతరం అంత్యక్రియలకు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సత్తినేని సుధాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాందాస్‌నాయక్, నాయకుడు మఠం రాజశేఖర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు చెన్నయ్య, శంకర్, నర్సింహులు, సుధీర్, సాయి, విజయ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి ప్రత్యేక కృషి

- మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్

బంట్వారం, నవంబర్ 16: రైతుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నదని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మర్పల్లి మార్కెట్ కమిటీ పరిధిలోని మోమిన్‌పేట, మర్పల్లి, బంట్వారం మండలాల్లో రైతుల సౌకర్యార్థం రూ.1.40 కోట్ల చొప్పున నాలుగు గోడౌన్ల నిర్మాణం ప్రభుత్వం చేపడుతున్నదని తెలిపారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే మండల కేంద్రంలో మేకల సంత ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించామన్నారు. వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం, మార్కెట్ డైరెక్టర్లు యాదగిరి, నర్సింహులు, ఇసాక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సుధాకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ ప్రభాకర్, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి హరీశ్వర్‌రెడ్డి, ఇతర నాయకులు శ్రీనివాస్, వెంకటయ్య, గౌస్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య

కులకచర్ల, నవంబర్ 16: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు అన్నారు. శనివారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళారుల నుంచి రైతులను కాపాడేందుకు ప్రభుత్వం వారికి అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు కృషిచేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రభూపాల్‌రావు, అంజిలయ్య గౌడ్, సీఈవో బక్కారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

మృతుడి అంత్యక్రియలకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య తెలిపారు. శనివారం మండల పరిధిలోని అంతారంలో మాజీ సర్పంచ్ కృష్ణయ్య తండ్రి దగ్గుల ఎల్లయ్య పీఏసీఎస్ సభ్యుడిగా ఉండి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన అంత్యక్రియలకు రూ.9వేలు ఆర్థిక సహాయం పీఏసీఎస్ ద్వారా అందజేశామన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, నాయకులు జలీల్, భీమయ్య, సాయన్న, సురేశ్, రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సహాయం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వెంకటేశం

పరిగి, నవంబర్ 16: పేదలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని జిల్లా లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వెంకటేశం తెలిపారు. శనివారం పరిగి సబ్‌జైలును జిల్లా లీగల్ ఎయిడ్ వెంకటేశం, శ్రీనివాస్, పరిగి లీగల్ ఎయిడ్ కౌన్సిల్ గౌస్‌పాషా సందర్శించారు. ఈ సందర్భంగా ఎవరైనా ముద్దాయిలు బెయిల్ పిటిషన్ వేయలేని పరిస్థితిలో ఉంటే వారి తరఫున పిటిషన్ దాఖలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా పరిగి సబ్‌జైలులో ఎంతమంది ముద్దాయిలు బెయిల్ పిటిషన్ వేయలేదని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాం

ఎస్సీ కమిషన్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు

కులకచర్ల, నవంబర్ 16: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని మాలమహానాడు వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శనివారం ఆయన ఎస్సీ కమిషన్ సూపరింటెండెంట్ ఉస్మాన్ అలీని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రకారం రిజర్వేషన్ కోటాను పెంచాలన్నారు. రాజ్యాధికారం దిశగా ముందుకు పోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మాల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కడుమూరు రాజ్‌కుమార్, జిల్లా సలహాదారులు ధారూర్ అంజయ్య, ప్రశాంత్, పరిగి డివిజన్ సలహాదారుడు పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

గేట్‌వనంపల్లిలో ఉచిత వైద్య శిబిరం

మందులను పంపిణీ చేస్తున్న వైద్యులు

నవాబుపేట, నవంబర్ 16: మండల పరిధిలోని గేట్‌వనంపల్లి గ్రామంలో వికారాబాద్‌కు చెందిన ప్రైవేటు దవాఖాన సిబ్బంది శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

వీరాంజనేయ స్వామికి లక్ష తమలపాకుల పూజ

ఆర్కేపురం, నవంబర్ 16 : సరూర్‌నగర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో 40వ బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం శ్రీ వీరాంజనేయ స్వామికి లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరుపోలు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతి ప్రసాద్, మాజీ చైర్మన్ గండు ధనంరెడ్డి, కమిటీ సభ్యులు బొగేశ్వర్‌రావు, సుబ్బారావు, శ్రీనివాస్‌రావు, ప్రతాప్‌రెడ్డి, మహేందర్, రవీందర్ రావు, రవీందర్‌రెడ్డి, కనకరావు, మారోజు శ్రీనివాస్‌చారీ, కృష్ణమాచార్యులు, వంశధాకచార్యులు, రామకృష్ణమాచార్యులు, శ్యాంసుందర్‌శర్మ తదితరులు ఉన్నారు

వాటర్ ఫిజిబిలిటీ సర్టిఫికేషన్ సులభతరం

సిటీబ్యూరో, నవంబర్ 16(నమస్తే తెలంగాణ): నూతన భవనాలకు వాటర్ బోర్డు ఇచ్చే వాటర్ ఫిజిబిలిటీ ధ్రువీకరణ ప్రక్రియను వాటర్ బోర్డు సులభతరం చేసింది. వాటర్ ఫిజిబిలిటీ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న 41రోజుల పని దినాల్లో జారీ చేసేందుకు ఏర్పాటు చేసింది. గతంలో ఉన్నట్లుగానే సీజీఎంకు దరఖాస్తు చేసుకుంటే ఆరు రోజుల్లో పరిశీలించి, 30 రోజుల్లో ఫీజు చెల్లించే అవకాశం కల్పిస్తారు. అక్కడి నుంచి 5 రోజుల పని దినాల్లో రెవెన్యూ విభాగం చీఫ్ జనరల్ మేనేజర్ సర్టిఫికెట్ జారీ చేయనున్నారు. దీంతో ప్రక్రియ వేగంగా జరిగిపోతుందని వాటర్ బోర్డు అధికారులు వెల్లడించారు.

మండల వ్యవసాయ అధికారిగా శ్రావ్య

బంట్వారం, నవంబర్ 16: మండల వ్యవసాయ అధికారిగా శ్రావ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఏవో సంధ్య రెండు నెలల క్రితం సంగారెడ్డికి బదిలీపై వెళ్లింది. అప్పటి నుంచి మర్పల్లి ఏవోకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వం నూతనంగా వ్యవసాయ అధికారులను నియమించింది. అందులో భాగంగా శ్రావ్యను ఇక్కడ నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు.

గ్రూప్ 4లో సత్తా చాటిన యువకుడు

నవీన్ కుమార్

యాలాల, నవంబర్ 16: మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ గ్రూప్ 4లో సత్తా చాటి వైద్య విధాన పరిషత్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆ యువకుడిని గ్రామస్తులు అభినందించారు. గ్రూప్ 4లో విజయం సాధించినప్పటికీ మరో ఉన్నత లక్ష్యంతో గ్రూప్ 3 రాస్తున్న నవీన్‌కు మరిన్ని విజయాలు చేకూరాలని ఆకాక్షించారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన నవీన్ కుమార్ గ్రూప్ 4లో విజయం సాధించడంలో ఆయన తల్లిదండ్రులు విజయలక్ష్మీమాణిక్ రెడ్డిల తోడ్పాటు, చేయూత ఎంతో గొప్పదని గ్రామస్తులు కొనియాడారు.

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

బంట్వారం/కోట్‌పల్లి, నవంబర్ 16: ఏడు గురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై శ్రవంతి తెలిపారు. కోట్‌పల్లిలో మధ్యాహ్నం కుమ్మరి లాలప్ప దుకానం ఎదుట రోడ్డు పక్కన గడ్డకింది ఎల్లయ్య, పళ్ల ప్రవీణ్‌కుమార్, తుమ్మళి భాస్కర్, సలీం కురేషి, ఎండీ గౌస్, నేర్లపల్లి రాచంద్రి, బలిజగూడెం శ్రీశైలం పేకాట ఆడుతున్నారు. పోలీసులు వారిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.8,200 స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఉత్సవాల విగ్రహాలు ధ్వంసం

పరిగి, నవంబర్ 16: దేవీ నవరాత్రులు, వినాయకచవితి సందర్భంగా ప్రతిష్ఠించే విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన పరిగిలో జరిగింది. ఎస్సై సంతోశ్‌కుమార్ తెలిపిన వివరాలు.. పరిగికి చెందిన కె.భాస్కర్ వినాయకచవితి సందర్భంగా వినాయక విగ్రహాలు, దేవీ నవరాత్రుల సందర్భంగా దుర్గామాత ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను విక్రయిస్తాడు. ఉత్సవాలు పూర్తవడంతో మిగిలిన విగ్రహాలను షెడ్డులో ఉంచి తాళం వేశాడు. శుక్రవారం రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు 6 దుర్గామాత, 2 వినాయక విగ్రహాలను ధ్వంసం చేయడంతోపాటు కంప్రెషర్ మోటార్‌ను దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఒక వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేశారని, ఈ మేరకు విచారణ చేస్తామన్నారు.

జహీరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

ఇద్దరు నగరవాసులు మృతి

- కల్వర్టును ఢీకొట్టిన కారు
- దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ఘటన

సురేశ్‌కుమార్, నర్సింహారావు(ఫైల్)

జహీరాబాద్ సమీపంలో కల్వర్టును ఢీ కొట్టడంతో నుజ్జునుజ్జయిన కారు

జహీరాబాద్, నవంబర్ 16: దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన జహీరాబాద్ పట్టణ సమీపంలోని ఆదర్శనగర్ పరిధిలోని 65వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. జహీరాబాద్ పట్టణ పోలీసులు కథనం ప్రకారం.. హైదరాబాద్ పట్టణ ప్రాంతంలోని సూరారంలోని శివాలయం కాలనీకి చెందిన సురేశ్, సంజీవ్‌రావు, శివకుమార్, మనోజ్ కలిసి కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా ప్రాంతంలోని గానుగపూర్ దత్తాత్రేయ స్వామి ఆలయానికి దర్శన నిమిత్తం వెళ్లారు. స్వామివారి దర్శన అనంతరం తిరిగి శుక్రవారం రాత్రి కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. జహీరాబాద్ పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీ సమీపంలో కారు అదుపు తప్పి జాతీయ రహదారిపై ఉన్న కల్వర్టును బలంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్ సిబ్బందితో హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న వారిలో సురేశ్‌కుమార్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా తీవ్రగాయాలైన సంజీవ్‌రావు, మనోజ్, శివకుమార్‌ను చికిత్స నిమిత్తం పోలీసులు జహీరాబాద్ ప్రభుత్వ దవాఖనకు తరలించారు. వీరి పరిస్థితి ఆందోళనకారంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ క్రమంలో మార్గమధ్యంలోనే తీవ్రగాయాలైన నర్సింహారావు మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు మనోజ్, శివకుమార్‌ను సంగారెడ్డికి తరలించగా, అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వీరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. నిద్రమత్తులోనే ఈ ఘటన జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్ పేర్కొన్నారు.



టీజీ సెట్ ఫలితాలు విడుదల చేస్తున్న ప్రొఫెసర్లు

టీజీ సెట్ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 16: తెలంగాణ రాష్ట్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టులకు అర్హత సాధించేందుకు నిర్వహించిన టీజీ సెట్-2024 పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను సెట్ కార్యాలయంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం. కుమార్, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డితో కలిసి సెట్ మెంబర్ సెక్రెటరీ, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి శనివారం విడుదల చేశారు. అనంతరం, ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి మాట్లాడుతూ, పరీక్షకు మొత్తం 33,494 మంది దరఖాస్తు చేసుకోగా, 26,294 మంది పరీక్షకు హాజరయ్యారని వివరించారు. పరీక్షకు హాజరైన వారిలో 1,884 మంది అర్హత సాధించారని చెప్పారు. పరీక్షకు హాజరైన వారిలో 7.17 శాతం అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించగా, వారిలో 49.79 శాతం మంది మహిళలేనని పేర్కొన్నారు. అభ్యర్థులు వారి వ్యక్తిగత హాల్ టికెట్ నంబర్, పుట్టిన రోజు తేదీలను ఎంటర్ చేసి స్కోర్ కార్డులను పొందవచ్చన్నారు. అర్హత సాధించిన వారికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించే తేదీలను త్వరలోనే తమ వెబ్‌సైట్ ద్వారా ప్రకటిస్తామని వివరించారు. కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, ఓయూ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొ. కరుణసాగర్, ప్రొఫెసర్లు విజయ, రాజేందర్, నాగేంద్రబాబు, సునీత, ఓఎస్డీ జితేందర్ కుమార్ నాయక్, లావణ్య, మురళీకృష్ణ, శ్రీనగేశ్, డా. కొండా నాగేశ్వర్, డా. గంగాధర్ పాల్గొన్నారు.

డైరెక్టర్ కృష్ణారావుకు పది పరీక్ష ఫీజు గడువు పెంచాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేస్తున్న లింగం గౌడ్, బడే సాబ్

టెన్త్ పరీక్ష ఫీజు గడువు 30 వరకు పొడిగించాలి

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 16: పదవ తరగతి పరీక్షల ఫీజు గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావుకు శనివారం నాంపల్లిలోని కార్యాలయంలో కలిసి లింగంగౌడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ.. పదవ తరగతి పరీక్షల గడువు ఈనెల 18వ తేదీతో ముగుస్తున్నందున పలువురు విద్యార్థులు తమ విద్యార్హతల వివరాలను యుడైస్ పోర్టల్‌లో నమోదు చేసుకోలేదని తెలిపారు. గతంలో కేవలం పదవ తరగతి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తేనే ఫీజు చెల్లించే అవకాశం ఉండేదని, ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రతి విద్యార్థి కచ్చితంగా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న వివరాలు ఆన్‌లైన్‌లో తప్పనిసరి చేయడం వల్ల నేటికీ పూర్తిస్థాయిలో నమోదు చేయకపోవడంతోపాటు సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని దృష్టిలో ఉంచుకుని ఫీజు చెల్లింపు గడువును పొడిగించాలని కోరారు. ఏంబీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు బడేసాబ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్, నవంబర్ 16: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. శంషాబాద్ పట్టణంలోని ఫ్లైఓవర్‌పై ప్రమాదం జరిగినట్లు సమాచారం అందడంతో వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు తీవ్రగాయాలైన వ్యక్తిని పరిశీలించగా.. అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మండలంలోని పోశెట్టిగూడ గ్రామానికి చెందిన కావాలి దర్శన్(48) గతంలో వీఆర్‌వోగా పని చేశాడు. వీఆర్‌వో వ్యవస్థను రద్దు చేయడంతో సదరు వ్యక్తి రాచకొండ కమిషనరేట్ పరిధిలో అకౌంట్ సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం విధులు ముగించుకొని ఇంటికి చేరుకున్న ఆయన తిరిగి ద్విచక్ర వాహనంపై శంషాబాద్‌కు వస్తూ శంషాబాద్ పట్టణంలోని ఫ్లైఓవర్‌ను రాంగ్‌రూట్లో ఎక్కుతుండగా హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో దర్శన్ అక్కడికక్కడే మృతి చెందాడు. దర్శన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొత్త ఎస్‌హెచ్‌జీ కోసం కసరత్తు

జీహెచ్ఎంసీ, మెప్మా అధికారులతో ఎంఏయూడీ ముఖ్య కార్యదర్శి సమీక్ష

సిటీబ్యూరో, నవంబర్ 16(నమస్తే తెలంగాణ): గ్రేటర్ పరిధిలో కొత్త స్వయం సహాయక సంఘాలు(సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్) ఏర్పాటుపై కసరత్తు చేయాలని జీహెచ్ఎంసీ, మెప్మా అధికారులను పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఆదేశించారు. శనివారం ఎంఏయూడీ కార్యాలయంలో జీహెచ్ఎంసీ, మెప్మా అధికారులతో స్వయం సహాయక సంఘాల ఏర్పాటుపై సమీక్షించారు. బ్యాంక్ లింకేజీ టార్గెట్, కొత్త గ్రూపుల ఏర్పాటు, ఆంత్రప్రెన్యూర్‌షిప్ కార్యకలాపాల అభివృద్ధి తదితరాలపై సమీక్షించారు. అదేవిధంగా పాత సంఘాలను బలోపేతం చేసేలా ప్రాధాన్యత కల్పించారు. డీసీ, మున్సిపల్ కమిషనర్లతో సమావేశాలు నిర్వహించి కొత్త ఎస్‌హెచ్‌జీలను ఏర్పాటు చేయాలన్నారు. డిసెంబర్ నెలాఖరు నాటికి ఎస్‌హెచ్‌జీలను ఏర్పాటు చేసి, కొత్త సభ్యుల నమోదు పూర్తి చేయాలన్నారు. కొత్త ఎస్‌హెచ్‌జీలను ఏరియా లెవల్ ఫెడరేషన్లు, టౌన్ ఫెడరేషన్లకు అటాచ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీడీఎంఏ డైరెక్టర్ శ్రీదేవీ, ఎంఏయూడీ డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి, జాయింట్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు, మెప్మా స్టేట్ మిషన్ కోఆర్డినేటర్స్ పద్మ, జీహెచ్ఎంసీ ప్రాజెక్టు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష దీపోత్సవం

ఆర్కేపురం, నవంబర్ 16 : ఆర్కేపురం డివిజన్ వాసవీ కాలనీలోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా కార్తీక లక్షదీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని పరమ శివుడిని తలుచుకుంటూ కార్తీక దీపాలను వెలిగించారు. దీంతో దేవాలయం పరిసర ప్రాంతాలు దీపాల వెలుగులతో నిండిపోయాయి. వాసవీ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌరీశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, కార్యదర్శి అయిత అంజయ్యగుప్తా, కోశాధికారి కృష్ణయ్య, కన్వీనర్ తమ్మన శ్రీధర్, గౌరిశెట్టి అరుణ్, సుదర్శన్, మధురఉపేందర్‌రెడ్డి, సుజాత, అరుణ, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై లభ్యం

పూడూరు నవంబర్ 16: గత నెల 25న అదృశ్యమైన కేసు నమోదైన వ్యక్తి శనివారం సాయంత్రం మృతదేహం లభ్యమైంది. పూడూరు మండల పరిధిలోని చన్గోముల్ ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. నవాబుపేట మండల పరిధిలోని అక్కంపూరం గ్రామానికి చెందిన పెద్ద గొల్ల రాణాప్రతాప్ (28) పూడూరు మండల పరిధిలోని చీలాపూర్ గ్రామానికి బంధువుల వద్దకు వచ్చారు. అదే రోజు రాత్రి బయటికి బంధువులకు చెప్పి బయటికి వెళ్లారు. ఆయన తిరిగి రాకపోవడంతో ఎంత వెతికినా జాడ తెలియ లేదు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు చన్గోముల్ పోలీస్ స్టేషన్‌లో మరు రోజు ఫిర్యాదు చేశారు. శనివారం ఆయన మృతదేహంతో పాటు బైక్ హైదరాబాద్-బీజాపూర్ హై వే రోడ్డు కండ్లపల్లి స్టేజీ వద్ద లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338958-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/శంకర్‌పల్లి/తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962